సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



ఏసీబీ వలలో సీఐ

భద్రాచలం పట్టణ సీఐ, ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో సాధారణ వ్యక్తిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 8లో



మక్కలు కొనేదెప్పుడో..?

జిల్లాలో మొక్కజొన్న పంట చేతికందినా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. సాయంత్రం కూడా వేడి వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

ఊంజల్ సేవలో కల్యాణ రామయ్య



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: సీతాలక్ష్మణ సమేతుడైన కల్యాణ రామయ్యకు గురువారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. దేవస్థానంలో జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన వధూవరులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో కొలువుదీర్చిన అర్చకులు లాలలు.. జోలలు పాడారు. ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు ఆలపించగా ఊంజల్ సేవ ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం స్వామివారికి స్వర్ణ పూరిత సింహవాహనంలో తిరువీధి సేవ జరిపారు.

13 నుంచి నిత్యకల్యాణాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి వసంతోత్సవం జరపనున్నారు. శనివారం జరిపే చక్రతీర్థం, ధ్వజావరోహణం, పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనుండగా స్వామి వారి నిత్యకల్యాణాన్ని 13వ తేదీ నుంచి తిరిగి ప్రారంభిస్తారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

బూర్గంపాడు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పినపాక నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బూర్గంపాడులోని గౌతమీపురం – సోంపల్లి బీటీ రోడ్డు, అశ్వాపురం మండలంలో అశ్వాపురం – బీజీ కొత్తూరు, అశ్వాపురం – జగ్గారం బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మణుగూరు సమితి సింగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగదుల నిర్మాణం, మణుగూరు – రామానుజవరం మధ్య హైలెవల్ బ్రిడ్జి, మణుగూరు – పగిడేరు మధ్య హైలెవల్ బ్రిడ్జి, పినపాక మండలంలో పినపాక – ఉప్పాక క్రాస్ బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత పినపాక – పోతిరెడ్డిపల్లి మధ్య బీటీ రోడ్డు, పినపాక – మల్లారం మధ్య బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశాక పినపాక–గడ్డంపల్లి మధ్య బీటీ రోడ్డును, పినపాకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తారు.

19న వెబినార్

కొత్తగూడెంఅర్బన్: భారతదేశ మొదటి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇండియా స్పెస్ వీక్ న్యూ ఢిల్లీ వారిచే ఈనెల 19న ఆన్‌లైన్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబినార్‌లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈనెల 17వ తేదీ లోగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానంలో ఆసక్తి, అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు డీఎస్ఓ(92472 96012)ను సంప్రదించాలని తెలిపారు.

సాగర్ కాల్వలకు నీరు నిలిపివేత

నాగార్జునసాగర్: సాగర్ కుడి, ఎడమ కాల్వలకు గురువారం సాయంత్రం నీటి విడుదల నిలిపివేశారు. యాసంగి పంటలకు గాను అధికారులు గత ఏడాది డిసెంబర్ 15 నుంచి ఆయకట్టుకు ఏకధాటిగా నీరు విడుదల చేస్తున్నారు. కుడికాల్వ కింద ఏపీలో 10.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అలాగే, ఎడమకాల్వ కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,98,790 ఎకరాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,63,736 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సీజన్‌లో 115 రోజుల పాటు కుడి కాల్వకు 100టీఎంసీలు, ఎడమ కాల్వకు 74టీఎంసీల నీటిని విడుదల చేశామని అధికారులు వెల్లడించారు.

జిల్లా తాగునీటి అవసరాలు తీరుస్తున్న గోదావరి

- పారిశ్రామిక అవసరాలకూ ఈ నది నీరే దిక్కు
- దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తగ్గుతున్న నీటి మట్టం
- మరో 15 రోజులకే గోదావరి నుంచి భరోసా

కాటన్ ఆనకట్ట వద్ద గోదావరిలో తగ్గిన నీరు



పక్షం దాటితే.. ప్రమాద ఘంటికలే!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మే నెల రాకముందే గోదావరి వట్టిపోతోంది. దుమ్ముగూడెం ఆనకట్ట దిగువ భాగంలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయి. దీంతో ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక కార్యాచరణ అవసరం కానుంది.

కాటన్ ఆనకట్ట నుంచే..

జిల్లాలోని మెజారిటీ ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఇందుకోసం పల్లె, పట్నం తేడా లేకుండా అంతటా ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించడంతో పాటు ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. అయితే ఇందుకు అవసరమైన రా వాటర్‌ను అశ్వాపురం మండలంలో గోదావరిపై నిర్మించిన కాటన్ ఆనకట్ట దగ్గర నుంచి తీసుకుంటున్నారు. మిషన్ భగీరథకు ప్రతీ రోజు 150 ఎంఎల్‌డీ నీటిని వినియోగిస్తున్నారు. గోదావరి తీరం వెంట విస్తరించిన హెవీ వాటర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, భద్రాచలం స్పెషల్ పేపర్ బోర్డ్ లిమిటెడ్‌లకూ ఈ నీటినే ఉపయోగిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహాలు సంతృప్తికర స్థాయిలో కొనసాగడంతో ఆనకట్ట నుంచి తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఎదురుకాలేదు. కానీ ఈసారి ఎగువ ప్రాంతం నుంచి గోదావరిలో ప్రవాహాలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

తగ్గుతున్న నీరు..

అశ్వాపురం – దుమ్ముగూడెం మధ్య గోదావరిపై నిర్మించిన ఆనకట్ట గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం ఆరు టీఎంసీలు. ఈ బరాజ్‌ను నిర్మించినప్పుడు డెడ్ స్టోరేజీ లెవల్ 36 మీటర్లు ఉండగా 49.5 మీటర్ల దగ్గర అలుగు పారుతుంది. అయితే 150 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం కావడంతో బరాజ్‌లో భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతో బరాజ్ డెడ్ స్టోరేజీ లెవల్ 42 మీటర్లకు చేరుకోగా, నీటి నిల్వ సామర్థ్యం నాలుగు టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుతం 47.7 మీటర్ల ఎత్తులో 0.98 టీఎంసీల నీరే ఇక్కడ నిల్వ ఉంది.

తేలిన బండరాళ్లు..

కాటన్ ఆనకట్టకు ఎగువన ఉన్న లక్ష్మి, సమ్మక్క బరాజ్‌ల నుంచి కనీస ప్రవాహాలే దిగువకు వదులుతున్నారు. దిగువకు వస్తున్న నీటికి, ఉపయోగిస్తున్న నీటికి మధ్య పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో క్రమంగా గోదావరి ఎండిపోతోంది. నదిలో ఎడమ వైపు మిషన్ భగీరథ, హెవీవాటర్ ప్లాంట్ ఇన్‌టేక్ వెల్స్ దగ్గరగానే ప్రవాహాలు ఉన్నాయి. కుడివైపున ఉన్న పర్ణశాల వైపు నదిలో ఇసుక మేటలు వేయగా, నదీ గర్భంలోని బండలు బయటకు కనిపిస్తున్నాయి. చివరకు సరుకు రవాణ కోసం ఉద్దేశించిన



సరుకు రవాణా కెనాల్‌లో నీటి పరిస్థితి ఇలా..

కెనాల్‌లోనూ నీటి నిల్వలు తగ్గిపోయి అడుగు కనిపిస్తోంది. దీంతో ఈ కెనాల్‌పై నిర్మించిన హైడల్ పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి కూడా ఆగిపోయింది.

పక్షం రోజులకే..

ప్రస్తుతం బరాజ్‌లో ఉన్న 0.98 టీఎంసీల నీటి నిలువలు ఈ నెలాఖరు వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథకు సరిపోతాయనే ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎండలు మరింతగా ముదిరితే నీటి ఆవిరి నష్టాలు పెరిగి ఈ సంఖ్య తగ్గిపోయే అవకాశముంది. పైనున్న లక్ష్మి, సమ్మక్క బరాజ్‌ల నుంచి విడుదల చేయించడంతో పాటు వచ్చే ప్రవాహాలను జాగ్రత్తగా వాడుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా సీతమ్మ సాగర్ నిర్మాణ పనులతో సంబంధం లేకుండా కాటన్ ఆనకట్టలో పూడిక తీత, లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేసి ప్రతీ బొట్టును ఒడిసిపట్టాల్సిన అవసరముంది.

పావు గంటలోనే ప్రక్రియ

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం
- పైలట్‌గా మూడు కార్యాలయాల్లో అమలు
- తొలిరోజు చిన్నచిన్న సమస్యలు మినహా సాఫీగానే..
- వచ్చే నెల 1నుంచి అన్ని కార్యాలయాల్లో అమలుకు కసరత్తు



కొత్తగూడెంలో డాక్యుమెంట్లు అందిస్తున్న ప్రత్యేక అధికారి కార్తీక్, సబ్ రిజిస్ట్రార్ వేణుమాధవ్

ఖమ్మంమయూరిసెంటర్/కొత్తగూడెం అర్బన్: ఒక దస్తావేజు రిజిస్ట్రేషన్ కోసం రోజంతా వేచి ఉండకుండా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ముందుగానే సమయాన్ని నిర్దేశించుకుని స్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని అమలుచేస్తుండగా, పావు గంటలోనే ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులు ఇచ్చేస్తున్నారు. ఈ విధానంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిలో హర్షం వ్యక్తమవుతోంది. ఇక స్లాట్ దొరకని వారు, బుక్ చేసుకోలేని వారి కోసం ప్రతిరోజు సాయంత్రం 5 – 6 గంటల మధ్య వాకిన్ విధానంలో ఐదు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని పలు కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా, ఉమ్మడి జిల్లాలోని మూడు కార్యాలయాల్లో గురువారం మొదలైంది. తొలి రోజు మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 68 స్లాట్లు బుక్ కాగా, 66 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అలాగే, వాకిన్ విధానంలో ఏడు దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేశామని అధికారులు వెల్లడించారు.

స్లాట్ బుక్ చేసుకుని..

దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రక్రియ పూర్తవడానికి సమయం పడుతుండడం.. ఒకే సమయంలో ఎక్కువ మంది వస్తే అధికారులు దస్తావేజులను సక్రమంగా పరిశీలించలేని పరిస్థితి ఎదురయ్యేది. దీంతో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం అమలుకు నిర్ణయించగా, పైలట్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కూసుమంచి, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను జాబితాలో చేర్చారు. గురువారం మొదలైన ఈ విధానంలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న సమయం ఆధారంగా వచ్చిన వారి దస్తావేజులను అధికారులు పరిశీలించి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. అంతేకాక రిజిస్ట్రేషన్ పత్రాలను కూడా అందజేశారు. వచ్చే నెల 1వ తేదీ నుండి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది.

చిన్న చిన్న సమస్యలు మినహా..

డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం స్లాట్ బుక్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో తొలిరోజు సర్వర్‌లో చిన్న చిన్న సమస్యలు ఎదురయ్యాయి. సర్వర్ నెమ్మదించడం, డాక్యుమెంట్ వివరాలను నమోదు చేస్తున్న సమయంలో వాటికవే డిలీట్ కావడంతో మళ్లీ మొదటి నుంచి నమోదు చేయాల్సి వచ్చింది. దీంతో వీటిని సరిచేసి, ఇంకొన్ని అంశాలను సైట్‌లో చేరిస్తే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతుందని అధికారులు వెల్లడించారు.

అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలుకావడంతో అధికారులు పర్యవేక్షించారు. జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు ఖమ్మం, కూసుమంచి కార్యాలయాల్లో, చిట్ రిజిస్ట్రార్ కార్తీక్ కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్లతో సబ్ రిజిస్ట్రార్ వద్దకు వచ్చిన క్రయవిక్రయదారులకు పదిహేను నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేయడం, ఆపై పది నిమిషాల్లో పత్రాలు ఇవ్వడం విశేషం. బయోమెట్రిక్, ఫొటో, డాక్యుమెంట్ల పరిశీలన, స్కానింగ్ అంతా ఈ సమయంలోనే పూర్తయింది.

తొలి రోజు రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల వివరాలు..

కార్యాలయం	స్లాట్ ద్వారా రిజిస్ట్రేషన్లు	వాకిన్ రిజిస్ట్రేషన్లు	మొత్తం
ఖమ్మం ఆర్‌వో	31	06	37
కూసుమంచి	13	00	13
కొత్తగూడెం	22	01	23

పురిటిగడ్డపై ప్రత్యేక దృష్టి

- ఇల్లెందు ప్రాంతానికి నష్టం కలగనివ్వం
- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

ఇల్లెందు: బొగ్గు గనులకు పుట్టినిల్లయిన ఇల్లెందుకు ఢోకా ఉండదని, ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని, ఎలాంటి నష్టం కలగనివ్వబోమని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన చట్టం సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం ఇల్లెందు జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో నాటి పాలకులు ఇల్లెందుపై శీతకన్ను ప్రదర్శించారని ఆరోపించారు. ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోతున్నా గుర్తింపు సంఘాల నాయకులు పట్టించుకోలేదని విమర్శించారు. నూతన గనుల ప్రారంభానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఇల్లెందు ఏరియాను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నూతన గనుల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రైవేట్ సంస్థలకు బొగ్గు బ్లాకులు వచ్చేలా చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి బొగ్గు పరిశ్రమ రక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇల్లెందు జేకే ఓసీ పొడిగింపు ఆదేశాలు, అనుమతులు త్వరలోనే వస్తాయని అన్నారు. పూసపల్లి ఓసీ కూడా ప్రారంభం అవుతుందన్నారు. ఇక్కడి కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం జనక్‌ప్రసాద్, నర్సింహారెడ్డి, త్యాగరాజులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ వికాస్‌కుమార్ యాదవ్, ఆల్బర్ట్, జె.వెంకటేశ్వర్లు, గోచికొండ సత్యనారాయణ, భూక్యా నాగేశ్వరరావు, మహబూబ్, కళ్లం కోటిరెడ్డి, పడిదల నవీన్, కొండూరి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు వైద్య శిబిరం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులకు కొత్తగూడెంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు 100 మంది విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, కార్డియాలజీ విభాగాల వారు పరీక్షించి తగిన సూచనలు చేశారు. కేన్సర్ వ్యాధిపై అవగాహన కలిగించారు. విద్యుత్ ఎస్ఈ జి మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంకాలజిస్ట్ కోట్ల బాలరాజు, కార్డియాలజిస్ట్ డాక్టర్ మజీద్, విద్యుత్ డీఈ ఎస్.కృష్ణ, కొత్తగూడెం, పాల్వంచ డీఈలు జి.రంగస్వామి, పీఎస్‌వీఎస్ నందయ్య, సర్కిల్ కార్యాలయ ఏఓ శ్రీధర్, టెక్నికల్ ఏడీఈ కె. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈ మహేందర్‌ను పరీక్షిస్తున్న వైద్యులు

రోడ్డును పరిశీలించిన ఐటీడీఏ పీఓ



అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

దుమ్ముగూడెం : మండలంలోని సీతారాంపురం గ్రామంలో నిర్మిస్తున్న ఈఎంఆర్‌ఎస్ పాఠశాలకు సంబంధించి రోడ్డు నిర్మాణంలో ఉన్న సమస్యను ఐటీడీఏ పీఓ బి.రాహుల్ గురువారం పరిశీలించారు. పాఠశాల నిర్మాణ పనులపై ఫిర్యాదు అందడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్‌ఐ కల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కేజీబీవీల్లోనూ చార్జీల పెంపు

- విద్యార్థినులకు కాస్మోటిక్స్, డైట్ బిల్లులు పెంచుతూ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 28 కేజీబీవీలు.. 8,480 మంది బాలికలు
- పెరిగిన చార్జీల అమలుతేదీపై కొరవడిన స్పష్టత



కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న బాలికలు

పాల్వంచరూరల్ : ఎట్టకేలకు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో కాస్మోటిక్స్, డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతేడాది డిసెంబర్ 13న సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు చార్జీలు పెంచిన ప్రభుత్వం.. తాజాగా కేజీబీవీ విద్యార్థినులకూ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అమలు చేసిన చార్జీలకు, నిత్యం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఇచ్చే బిల్లుల్లో తేడాలు ఉండడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ క్రమంలో కస్తూర్బా విద్యార్థినులకూ డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ఉన్నతాధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

గతంలో అన్ని తరగతులకూ ఒకే చార్జీలు..

గతంలో 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని తరగతుల విద్యార్థినులకు డైట్ చార్జీలు నెలకు రూ.1,225, కాస్మోటిక్స్ చార్జీలు రూ.100 చెల్లించేవారు. కాగా, తాజా నిర్ణయం ప్రకారం 6, 7 తరగతుల వారికి డైట్ చార్జీలు రూ.1,330 చొప్పున, కాస్మోటిక్స్ చార్జీలు రూ.175 చెల్లించాలని నిర్ణయించారు. ఇక 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు డైట్ చార్జీలు రూ.1,540, కాస్మోటిక్స్ చార్జీలు రూ.275 ఇవ్వాలని నిర్ణయించారు. ఇంటర్ విద్యార్థినులకు డైట్ చార్జీలు రూ.2,100, కాస్మోటిక్స్ చార్జీలు రూ.275 చొప్పున చెల్లించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని 28 విద్యాలయాల్లో..

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 14, భద్రాద్రి జిల్లాలో 14 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులు 4,780 మంది ఉండగా, భద్రాద్రి జిల్లాలో 3,700 మంది ఉన్నారు. బాలికలకు బలవర్థకమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం మెనూ బిల్లులు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బాలికల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఉండడంతో నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్ వడ్డించడమే కాక, బుధవారం మినహా మిగితా రోజుల్లో అరటి, లేదా సీజనల్ పండ్లు, సేమియా, గులాబ్‌జామ్, అటుకులు, స్నాక్స్, పల్లీపట్టి, మిక్చర్, టీ అందించాల్సి ఉంది. పాత మెనూ ప్రకారం వాటిని అమలు చేయాలంటే విద్యార్థినులకు వచ్చే బిల్లులు సరిపోక అరకొరగా పెట్టాల్సి వచ్చేది. కొన్ని స్కూళ్లలో అయితే చికెన్, మటన్ పెట్టిన సందర్భాలు తక్కువే. గత చార్జీలతో మెనూ పక్కాగా అమలు చేయడం అధికారులకు ఇబ్బంది గానే ఉండగా ప్రస్తుతం చార్జీల పెంపుతో కేజీబీవీ కో ఆర్డినేటర్లు, ప్రత్యేకాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమలుపై కొరవడిన స్పష్టత..

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం, కాస్మోటిక్స్ చార్జీలు పెంచినా.. ఇవి ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనే విషయంలో స్పష్టత లేదు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో నిర్దిష్ట తేదీ పేర్కొనలేదు. మరో 10రోజులు దాటితే వేసవి సెలవులు వస్తాయి. అయితే పెరిగిన చార్జీలు ఈ నెలలో అమలు చేస్తారా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తారా అనేది స్పష్టత రాలేదని కేజీబీవీల ప్రత్యేకాధికారులు చెబుతున్నారు.

డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెరిగాయి



కేజీబీవీల్లో బాలికలకు ప్రయోజనం కలిగించేలా ప్రభుత్వం డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెనూ అమలుపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.తులసి, సమగ్ర శిక్షా అభియాన్ జీసీడీఓ, ఖమ్మం

చార్జీలు పెంచడం ఆనందంగా ఉంది



కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదివే మాకు డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. పెరిగిన చార్జీలు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– లక్ష్మీ తిరుపతమ్మ, కేజీబీవీ పాల్వంచ

కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం సంతోషం



డైట్ చార్జీలతో పాటు కాస్మోటిక్స్ చార్జీలను కూడా గతంలో కంటే ఎక్కువగా పెంచడం సంతోషం. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఈ పెంపు మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగకరం.

– సాహిత్య, 6వ తరగతి

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి

- అడవుల సంరక్షణ అందరి బాధ్యత
- డీఎఫ్ఓ కిష్టాగౌడ్



అన్నపురెడ్డిపల్లి ప్లాంటేషన్‌లో మాట్లాడుతున్న కిష్టాగౌడ్

చంద్రుగొండ / అన్నపురెడ్డిపల్లి : అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి కిష్టాగౌడ్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని ప్లాంటేషన్‌లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం చంద్రుగొండలోని రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆదాయ వనరులు పెరుగుతాయని అన్నారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. కొత్తగా పోడుపేరుతో అడవులను ధ్వంసం చేసినా, అక్రమించుకున్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అడవుల్లో ఉచ్చులు, తుపాకులు, విద్యుత్ వైర్లు అమర్చి వన్యప్రాణులను వేటాడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సహకరించే వారిపై కూడా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

మణుగూరు టౌన్: మణుగూరు యువకులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక య్యారని సైక్ జిమ్ కోచ్ పాడిశెట్టి నాగరాజు గురువారం తెలిపారు. ఖమ్మంలో 53,72,77 కేటగిరీలలో లక్ష్మణ్, ఖైరుద్దీన్, ఖమర్, హఫీజ్, 93 కేటగిరీలో మాథిన్, 66 కేటగిరీలో జిమ్ ట్రైనర్ నాగరాజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువకులను పలువురు అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

దమ్మపేట : రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... సూర్యాపేట జిల్లా కాసరబండ గ్రామానికి చెందిన మచ్చ ఎల్లయ్య (37) మండలంలోని గట్టుగూడెం గ్రామంలో వేరుశెనగ కోత కోసే పనికి వచ్చాడు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఖమ్మం నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఎల్లయ్యకు తీవ్రగయాలు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

దమ్మపేట : యువకుడి ఆత్మహత్యపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన గీగా శివ (28) పంపు ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులపాలు కావడంతో బుధవారం భార్యతో గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో అదే రోజు ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అదనపు ఎస్సై బాల స్వామి తెలిపారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురంలో భూ వివాదంలో గురువారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గ్రామంలో 190/1 సర్వే నంబర్‌లో ఎకరం 20 కుంటల భూమిపై గ్రామస్తులకు, సారపాకకు చెందిన కనకమేడల హరిప్రసాద్ కుటుంబసభ్యులకు ఏళ్లుగా వివాదం నెలకొంది. గ్రామ కంఠం భూమి అని రెవెన్యూ అధికారులు నిర్ధారించి గ్రామ పంచాయతీకి అప్పగించారని గ్రామస్తులు చెబుతుండగా, తమకు తాత ముత్తాల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని హరిప్రసాద్ కుటుంబీకులు చెబుతున్నారు. హైకోర్టును ఆశ్రయించగా, తనకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చిందని గురువారం హరిప్రసాద్ తన అనుచరులతో జేసీబీని తీసుకుని వచ్చాడు. భూమికి ఫెన్సింగ్ వేసే ప్రయత్నం చేయగా రామచంద్రాపురం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. హరిప్రసాద్ అనుచరుడి కారు అద్దాలు పగిలాయి. సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు. ఈ క్రమంలో సివిల్ డ్రస్‌లో ఉన్న సీఐ గన్‌మెన్ రమేష్‌ను హరిప్రసాద్ అనుచరుడిగా భావించి అతనిపై ఓ వ్యక్తి చేయి చేసుకోగా, గ్రామస్తులు నిలువరించారు. అనంతరం ఇరువర్గాలు అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి.

ఆక్రమిత భూముల్లో జామాయిల్ నరికివేత


అడవిలో నరికివేసిన జామాయిల్ తోట

అశ్వారావుపేట: ఆక్రమిత అటవీ భూముల్లో సాగవుతున్న జామాయిల్ తోటలను ఆక్రమణదారులు నరికివేశారు. వినాయకపురం అటవీ ప్రాంతంలోని దమ్మపేట రేంజ్ తిరుమలకుంట సెక్షన్ దిబ్బగూడెం బీట్‌లో అడవులను ఆక్రమించుకుని కొందరు కార్పొరేట్ వ్యవసాయం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయమై ఈ నెల 3న 'అటవీ భూమి ఆక్రమణ'అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. మరుసటి రోజు దమ్మపేట రేంజ్ అధికారి కరుణాకరాచారి విచారణ నిర్వహించి ఆక్రమణలు ఖాళీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కానీ ఏ ఒక్కరిపైనా కేసులు నమోదు చేయలేదు. పైగా అటవీభూమిలో ఉన్న సంపద ప్రైవేటు వ్యక్తులు తరలించుకుపోతున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. అటవీశాఖ, రెవెన్యూ శాఖకు చెందిన కొందరు అధికారులు సైతం అటవీ భూములను ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా అటవీశాఖకు చెందిన ఓ అధికారి భోరోసాతోనే జామాయిల్ నరుకుతున్నట్లు సమాచారం. దీనిపై ఓ బీట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా దురుసుగా సమాధానం చెప్పారని సమీప రైతులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై దమ్మపేట రేంజ్ అధికారి కరుణాకరాచారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు.

మక్కలు కొనేదెప్పుడో..?

- మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- మద్దతు ధర కంటే తక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు
- ఆందోళన చెందుతున్న మొక్కజొన్న రైతులు


కొమరారంలో కల్లంలో ఆరబెట్టిన మక్కలు

ఇల్లెందురూరల్: జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంట చేతికొచ్చింది. యాభై శాతానికి పైగా నూర్పిడి కూడా పూర్తి కావడంతో మక్కలను కల్లాల్లో ఆరబెట్టారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామని ఇటీవల మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆశించిన దిగుబడి రాకున్నా కనీసం మద్దతు ధరైనా దక్కుతుందని భావించారు. ప్రకటన వెలువడి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవడం, మరోవైపు అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

11 కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 11 చోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇల్లెందు, చల్లసముద్రం, కొమరారం, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, మర్కోడు, శెట్టుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేటతోపాటు దిగుబడిని బట్టి మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

16,938 ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రస్తుత యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 16,938 ఎకరాలుగా నమోదైంది. అనధికారికంగా (పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని భూములు) మరో పదివేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. ఇందులో అత్యధిక విస్తీర్ణం ఇల్లెందు ఏజెన్సీలోనే సాగవుతోంది. సాధారణంగా వానాకాలం కంటే యాసంగిలోనే మొక్కజొన్న దిగుబడి అధికంగా ఉంటుంది. కానీ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఈసారి మొక్కజొన్న దిగుబడి తగ్గింది. ఎకరానికి 30 క్వింటాళ్ల దాటడం లేదు. ఈ చొప్పున జిల్లావ్యాప్తంగా సుమారు 50 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారు..

ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,225 మద్దతు ధర ప్రకటించింది. కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వాతావరణంలో మార్పులు, తరచూ వర్ష సూచనలతో ఆందోళనకు గురై వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అదే అదునుగా వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారని, క్వింటాల్‌కు రూ.2 వేల నుంచి చెల్లించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఏటా మక్కల కొనుగోళ్ల సమయంలో ఎర్రజెండా పార్టీలు రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి మద్దతు ధరను నిర్ణయించే సంప్రదాయం ఇల్లెందు ఏజెన్సీలో ఉంటుంది. ఈసారి కూడా సమావేశం నిర్వహిస్తామని పది రోజుల క్రితం ప్రకటించినా.. ఆ తర్వాత మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది.

తక్కువకే విక్రయిస్తున్నాం



మొక్కజొన్న కంకులను నూర్పిడి చేసి పక్షం రోజులైంది. వాతావరణంలో మార్పులు, వర్ష సూచనతో ఆందోళన కలుగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో క్వింటా రూ.2,050కి విక్రయించాను. క్వింటాకు రూ.200 నష్టపోయాను. – మంచె శ్రీను, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

కేంద్రాలు ప్రారంభించాలి

ఏటా మొక్కజొన్న కొనుగోళ్లు యాభైశాతం పూర్తయిన తరువాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తోంది. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది. ఇప్పటికే అత్యధిక మంది రైతులు నూర్పిడి పూర్తి చేసి పంట విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. మార్క్‌ఫెడ్ తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. – అజ్మీర సీతారాం, రైతు, బోయితండా, ఇల్లెందు మండలం

ఏసీబీ వలలో సీఐ

కానిస్టేబుల్, మరో ప్రైవేట్ వ్యక్తిపైనా కేసు నమోదు


ఏసీబీకి పట్టుబడ్డ సీఐ రమేష్, కానిస్టేబుల్ రామారావు, ప్రైవేటు వ్యక్తి కార్తీక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ బర్పాటి రమేష్‌తో పాటు అతడి గన్‌మెన్(కానిస్టేబుల్) రామారావు, మరో వ్యక్తిపై ఏసీబీ అధికారులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏసీబీ ఖమ్మం డీఎస్పీ రమేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గత మార్చి 19న బూర్గంపాడు మండలం లక్ష్మీపురం నుంచి ఓ గ్రావెల్ లారీ భద్రాచలం వచ్చింది. ఈ లారీకి అనుమతులు లేవంటూ టౌన్ పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ తరలిస్తున్న ఇంటి యజమానిని పిలిచి విచారణ చేయగా తన ఇంటి కోసమే ఉపయోగిస్తున్నానని బదులిచ్చాడు. అనంతరం లారీ యజమానిని పిలిచి 'లారీతో పాటు నీపైనా కేసు నమోదు చేస్తాం'అని సీఐ బెదిరించారు. దీంతో అతడు అలాగే కేసు నమోదు చేసుకోండని చెప్పగా సీఐ గన్‌మెన్‌గా ఉన్న కానిస్టేబుల్ రామారావు ఇద్దరితోనూ చర్చించి రూ.20వేలు ఫోన్ పే చేస్తే కేసు లేకుండా లారీని పంపిస్తామని చెప్పాడు. ఇక చేసేది లేక లారీ యజమాని.. రామారావు చెప్పిన నంబర్‌కు రూ.20వేలు ఫోన్ పే చేశాడు. దీంతో మార్చి 19న లారీపై కేసు నమోదు చేయలేదని, ఈమేరకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. ఈక్రమంలో సీఐ, కానిస్టేబుల్‌తో పాటు ఫోన్ పే ద్వారా డబ్బు అందిన కార్తీక్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రామారావు బిల్లులు కట్టిన రెస్టారెంట్ యజమాని వద్ద వివరణ తీసుకోవడంతోపాటు మార్చి 19న భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన సీసీ పుటేజీని కూడా ఏసీబీ అధికారులు తీసుకున్నారు. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదు చేసిన వారి పేరు మాత్రం ఆయన వెల్లడించలేదు. కాగా తనను అన్యాయంగా ఏసీబీ అధికారులు ఈ కేసులో ఇరికిస్తున్నారని సీఐ బర్పాటి రమేష్ ఆరోపించారు. కానిస్టేబుల్ రామారావు నగదు తీసుకున్నాడో లేదా తనకు తెలియదని పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులపై ఒత్తిడి!

సీఐ రమేష్, కానిస్టేబుల్ రామారావు, మరో ప్రైవేట్ వ్యక్తిని ఏసీబీ పోలీసులు అదుపులోకి తీసుకుని దాదాపు 4 గంటలపాటు విచారణ చేశారు. ఈ క్రమంలో సీఐ రమేష్‌ను కేసు నుంచి తప్పించాలని ఏసీబీ అధికారులపై ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే తాము ఎటువంటి ప్రలోభాలకు లొంగేది లేదని, ఎవరు ఫోన్ చేసినా ఏసీబీ చిక్కితే వదలబోమని విలేకరుల సమావేశంలో ఏసీబీ డీఎస్పీ తెలిపారు. తమపై ఎటువంటి ఒత్తిడి రాలేదని, వచ్చినా వినేది లేదని పేర్కొన్నారు.

స్టేషన్ బిల్లులు కట్టాను..

లారీ యజమాని పందు(వెంకటరెడ్డి)వచ్చి నన్ను కలిశాడు. అనంతరం సీఐ రమేష్‌ను కలిసి కొంత నగదు ఇస్తానని, లారీ వదిలిపెట్టాలని కోరగా.. సీఐ నిరాకరించాడు. నేనే స్టేషన్‌కు సంబంధించి బయట పెండింగ్ బిల్లులు ఉండటంతో నా స్నేహితుడు కార్తీక్ అనే వ్యక్తికి ఫోన్ పే కొట్టించి, ఆ నగదును పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో పెండింగ్‌లో బకాయి చెల్లించాను. – రామారావు, సీఐ గన్‌మెన్

గతంలో జరిగిన ఏసీబీ దాడులు..

- భద్రాచలంలో గురువారం పోలీసులే ఏసీబీ అధికారులకు పట్టుబడటం సంచలనంగా మారింది. ఇప్పటివరకు భద్రాచలంలో ఐదు సార్లు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి వివిధ శాఖల అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. తాజా ఘటన ఆరోది.
- 2024, ఏప్రిల్ 18న ఓ దొంగతనం కేసులో నిందితుల నుంచి లంచం తీసుకుంటూ భద్రాచలం ఎస్ఐ శ్రీనివాస్, ఓ కానిస్టేబుల్‌తోపాటు, మరో ప్రైవేటు వ్యక్తి కలిసి ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2020 మార్చి 5న భద్రాచలం ఎస్టీఓలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఆయనను లంచం తీసుకోవాలని ప్రోత్సహించిన ఎస్టీఓ ఎస్కే సైదులుతోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు.
- 2019 నవంబరు 28న భద్రాచలం తహసీల్‌లో సీనియర్ అసిస్టెంట్ కుంజా శ్రీనివాసరావు రూ.వెయ్యి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- అంతకుముందు భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కూడా అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.
- 2018 ఏప్రిల్ 30న ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో ఈఈ ఎం.శంకర్, ఏఈ సత్యనారాయణలను రూ.50 వేలు తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు.

పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కోరారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం పురోగమనంలో పయనిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరోగమన దిశలో పయనిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ దామోదర్, మాజీ ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్య సోన, బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కిలారు నాగేశ్వరరావు, పాల్వంచ సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, రాజుగౌడ్, కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కోరారు. మండలంలోని గుట్టమల్లారంలో గురువారం జరిగిన పినపాక నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉన్నప్పుడు చుట్టూరా తిరిగి అధికారం లేనప్పుడు దొంగల్లా వ్యవహరిస్తున్న వారందరిని గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, మండలాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు క్లినిక్ సీజ్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లులో హైడోస్ యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్, ఎసెప్టిక్ కండిషన్స్, ఇంజెక్షన్ ఫార్మ్స్ ఉపయోగిస్తున్న క్లినిక్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. ఎన్‌సీడీ పీఓ డాక్టర్ మధువరుణ్ గురువారం పాపకొల్లు గ్రామంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. హైడోస్ మందులు వాడుతుండటంతో క్లినిక్‌ను సీజ్ చేసి మూసివేశారు. గ్రామీణ వైద్యులు స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఇటీవల ఆర్ఎంపీ చేసిన ఇంజెక్షన్ల వల్ల జ్వరంతో ఉన్న ఐదేళ్ల బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని ఆరోపణల నేపథ్యంలో ప్రైవేట్ క్లినిక్‌లో తనిఖీలు జరిగాయనే చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, హెచ్ఈఓ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ ఘటనలో వాంగ్మూలం రికార్డ్

పాల్వంచ: మైనర్ బాలిక కిడ్నాప్ ఘటనలో గురువారం పోలీసులు వాంగ్మూలం రికార్డ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 29న ఓ బాలిక కిడ్నాప్ కాగా, తల్లిదండ్రులు ఈ నెల 1న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడైన ట్రాక్టర్ డ్రైవర్ లకావత్ నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు ఛేదించి, బాధితుల వాంగ్మూలం తీసుకున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

కొత్తగూడెంఅర్బన్: పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు వెల్లడించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లెందు మండలం తంగేళ్లగడ్డకు చెందిన భూక్య నాగేశ్వరరావు అలియాస్ నగేష్ తన బంధువు కుమార్తెలైన ఆరు, నాలుగు ఏళ్ల బాలికలపై 2024, జూలై 4వ తేదీన అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారులు కేకలు వేయడంతో నాగేశ్వరరావు పారిపోయాడు. మరుసటి రోజు ఈ విషయమై బాలికల తండ్రి ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు. పోలీస్ అధికారులు విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున కోర్టులో 15 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి భూక్యా నాగేశ్వరరావుకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసులు, ప్రాసిక్యూషన్ సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్: మొబైల్ ఫోన్ చోరీ కేసులో ముద్దాయి సాయితేజకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ భద్రాచలం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ గురువారం తీర్పు చెప్పారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఉన్న శివరామకృష్ణ కేసు నమోదు చేయగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ నర్సింహారావు సహకరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దుమ్ముగూడెం : అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి లక్ష్మీనగరంలో పట్టుకున్నారు. ఆర్ఐలు వెంకటేశ్వరరావు, నరసింహారావు ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న బస్తాలను స్వాధీనం చేసుకుని, సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించారు.

మాజీ ఎమ్మెల్యే కుమారుడి మృతి


ఊకే ప్రభాకర్ (ఫైల్)

ఇల్లెందురూరల్: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కుమారుడు ఊకే ప్రభాకర్ (45) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో గతేడాది నవంబర్ 24న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య మృతి చెందారు. అప్పటికే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ప్రభాకర్‌ను మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ బుధవారం గుండె సంబంధిత శస్త్రచికిత్స చేశారు. అయినా ఫలితం లేక గురువారం ఉదయం కన్నుమూశారు. ప్రభాకర్ మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


మృతి చెందిన గేదెల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత మహిళ

దమ్మపేట: విద్యుత్ వైర్లు తెగిపడటంతో రెండు గెదేలు, దూడ మృతి చెందిన ఘటన మండలంలోని రంగువారిగూడెం గ్రామ పంచాయతీ వెంకటరాజాపురం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వెంకటరాజాపురం గ్రామానికి చెందిన దుంగల నాగమణి తన రెండు గెదేలు, దూడను గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో మేత కోసం తోలుకుని వెళ్లింది. గెదేలు మేస్తుండగా అకస్మాత్తుగా 11 కేవీ విద్యుత్ వైరు తెగిపోయి గెదేలపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, విద్యుత్ శాఖ స్పందించి ఆదుకోవాలని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతారాంపురం శివారు వాగు నుంచి ఇసుక తోలుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి, అనుమతిపత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీవీకే–5 గనిలో ప్రమాదం

కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పద్మావతి ఖనిలో కంటిన్యూస్ మైనర్(సీఎమ్మార్) వద్ద పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు జయపాల్‌కు గాయమైంది. ఇతను గెయిన్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడు పనిచేస్తున్నాడు. గురువారం గనిలో సీఎంఆర్ వద్ద పనిచేస్తున్న క్రమంలో పైనుంచి బొగ్గుపెళ్ల పడి తలకు గాయమైంది. వెంటనే కార్మికుడిని సింగరేణి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా సదరు కంపెనీ నిర్వాహకులు ప్రమాద విషయాన్ని బయటికి పొక్కకుండా ప్రయత్నించారు. గాయపడిన కార్మికుడిని ఎవరూ కలిసే వీలులేకుండా అడ్డుకుని గెస్ట్ హౌస్‌లో ఉంచారు.

మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: చర్ల మండల శివారు రాంపురం అడవుల్లో మావోయిస్టులు ఏర్పాటు చేసిన నాలుగు శక్తిమంతమైన మందుపాతరలను గురువారం కోబ్రా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని బీమారం క్యాంపునకు చెందిన కోబ్రా 204 బెటాలియన్‌కు చెందిన పోలీసు బలగాలు సమీప అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బీమారానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మందుపాతరలను గుర్తించారు. బాంబు డిస్పోజబుల్ బృందం వచ్చి ప్రెజర్‌బాంబు, మూడు బీరు బాటిల్ బాంబులుగా నిర్ధారించి, అక్కడే నిర్వీర్యం చేశారు. దీంతో పోలీసులకు పెనుప్రమాదం తప్పిందని బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు.


కోబ్రా బలగాలు గుర్తించిన మందుపాతరలు

మృతుడి గుర్తింపు.. అంత్యక్రియలు


మృతదేహం వద్ద కుటుంబీకులు, ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఏన్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ వ్యక్తి మృతి మృతదేహాన్ని గుర్తించగా, ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. పత్రికల ద్వారా విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం చుంచుపల్లి వాసులు, కుటుంబీకులు ఆ మృతదేహం గోడి విజయబాబుదిగా గుర్తించారు. విజయబాబు మతిస్థిమితం కోల్పోయినట్లు చెబుతూ, అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేదని అన్నం ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు నేతృత్వాన బల్లేపల్లి వైకుంఠధామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఇప్ప పువ్వు పానకం ధ్వంసం


పానకం ధ్వంసం చేసిన డ్రమ్ములతో ఎక్సైజ్, పోలీసు అధికారులు

మణుగూరు టౌన్: మండలంలోని పగిడేరు పెద్దిపల్లి గొత్తికోయ గుంపులో నిల్వ ఉంచిన ఇప్ప పువ్వు పానకాన్ని ఎక్సైజ్, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో గొత్తికోయ గుంపు, పగిడేరు గ్రామాల్లో దాడులు నిర్వహించి 800 లీటర్ల ఇప్ప పువ్వు పానకాన్ని పారబోశారు.

'అవి రేషన్ బియ్యమే..'


పోలీసులు పట్టుకున్న బియ్యం లారీ

ములకలపల్లి: తాము పట్టుకున్న లారీలో ఉన్నవి రేషన్ బియ్యమేనని ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు. ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా బియ్యం తరలిస్తున్న లారీని మండల పరిధిలోని జగన్నాథపురం శివారులో మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే. లారీలో ఉన్నవి రేషన్ బియ్యమా? కాదా? నిర్ధారించేందుకు సివిల్ సప్లై డీటీ సుంకర శ్రీనివాసరావు బియ్యం శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కాగా ల్యాబ్ రిపోర్టులో రేషన్ బియ్యంగా తేలినట్లు ఎస్సై తెలిపారు. లారీలో 50 కేజీల బరువుగల 700 బస్తాలు ఉన్నాయని, మొత్తం 34 టన్నుల పీడీఎస్ రైస్‌ను అక్రమంగా తరలిస్తుంటే పట్టుకున్నామని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.